ప్రజాశక్తి
ఆదివారం 21 జూలై, 2024
5
శ్రీకాకుళం



ప్రతి శుక్రవారమూ డ్రై డే

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రతి శుక్రవారమూ డ్రై డేగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు సూచించారు. మండల మహిళా సమైక్య భవనంలో మండల సమైక్యలోని 35 గ్రామ సంఘాల అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, సిబ్బంది శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమైక్య ఆడిట్, వార్షిక నివేదిక, కట్టుబాట్లు, రుణాలు చెల్లింపు, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు ఏర్పాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వివరించారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి ప్రతి గ్రామంలో, వీధుల్లో ఇంటి పరిసరాల్లో శుభ్రత పరిశుభ్రత నీరు ఇతర వ్యర్థాలు నిల్వ ఉంచకుండా చూడాలన్నారు. తద్వారా దోమలు, ఈగలు లేకుండా అంటు వ్యాధులు రాకుండా బాధ్యత తీసుకోవాలన్నారు.

టెక్కలి గ్రేడ్ పెరిగేనా..!

- ముస్సిపాలిటీగా మార్పుపై ప్రతిపాదనలు!
- సర్పంచ్‌ల అభ్యంతరం

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి నియోజకవర్గాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా జిల్లా కేంద్రానికి ధీటుగా తయారు చేస్తామన్న వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాటల వెనుక ఆంతర్యంపై ప్రజలు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇటీవల జిల్లా కేంద్రానికి ధీటుగా అని మంత్రి అనడాన్ని పరిశీలిస్తే... టెక్కలి మున్సిపాలిటీగా మారనుందా? అనే ఆలోచన ప్రజల్లో మరలా వెల్లడవుతుంది. మున్సిలిటీగా మార్పుపై ప్రతిపాదనలు పంపినట్లు ఊహాగానాలు విస్తృతంగా ప్రచారం సాగుతోంది. ఇదే వాస్తవమైతే టెక్కలి మున్సిపాలిటీ కన్న మేజర్ పంచాయతీగానే ఉండాలని పలువురు ఆశిస్తున్నాయి. డివిజన్, నియోజకవర్గ కేంద్రమైన టెక్కలి మేజర్ పంచాయతీని మున్సిపాలిటీగా మార్చాలని 2006లో కీర్తిశేషులు మాజీ ఎమ్మెల్యే హనుమంతు అప్పయ్యదొర ప్రతిపాదనలు చేశారు. టెక్కలి మున్సిపాలిటీ అయితే ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల ద్వారా, ప్రజలు వివిధ రూపాల్లో చెల్లించే పన్నులు ద్వారా పట్టణాన్ని అభివృద్ధి చేయవచ్చుననే ఆలోచనతో అప్పట్లో అప్పయ్యదొర ఈ ప్రతిపాదన చేశారు. అప్పటి నిబంధనలు ప్రకారం టెక్కలి మున్సిపాలిటీగా మారాలంటే అందుకు సుమారు 30 వేల పైచిలుకు జనాభా ఉండాలన్న నిబంధన అడ్డువచ్చింది. దీంతో ఆ ప్రతిపాదన అక్కడితో ఆగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగే రాజకీయ పరిణామాలు, ప్రభుత్వాలు మారడంతో టెక్కలికి చెందిన డాక్టర్ కిల్లి కృపారాణి జిల్లా ఎంపీగా గెలిచి, కేంద్ర సహాయ మంత్రి హోదాలో మరలా మున్సిపాలిటీ ప్రతిపాదన తెరకెక్కింది. అయితే టెక్కలి మున్సిపాలిటీగా మారాలంటే జనాభా సమస్య ఏర్పడడం, నిబంధనల మేరకు జనాభా కూడా లేదు. అలాగే టెక్కలికి ఆనుకుని ఉన్న తొలుసూరుపల్లి, రావివలస, సీతాపురం, బన్నువాడ, అయోధ్యాపురం, వంటి సమీప పంచాయతీలను విలీనం చేస్తే వాటి జనాభా కలిపి టెక్కలి మున్సిపాలిటీగా మార్చవచ్చుననే ఆలోచన అప్పట్లో చేశారు. ఇందుకు సంబంధించి సమీప పంచాయతీల్లో కొందరు తమ సమావేశాల్లో భాగంగా తీర్మానాలు చేసి తమ ఆమోదం తెలియజేశారు. అయినా టెక్కలి మున్సిపాలిటీ ఏర్పాటు ప్రకటనగానే మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో 2019లో ఒక ప్రయివేట్ కార్యక్రమం నిమిత్తం టెక్కలి వచ్చిన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తన మాటల్లో టెక్కలి మున్సిపాలిటీగా మారుతుందని చెప్పారు. పరిశీలిస్తే అసలు టెక్కలి మేజర్ పంచాయతీగా ఉంటుందా? మున్సిపాల్టీగా మారిపోనున్నదా? అనే సందేహాన్ని పలువురు వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే టిడిపికి చెందిన ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కూడా అడపాదడపా చేస్తున్న ప్రసంగాల్లో టెక్కలిని జిల్లా కేంద్రానికి ధీటుగా తయారు చేస్తామని చెబుతుండడంతో సందేహాలకు తావిస్తుంది.

టెక్కలి మేజర్ పంచాయతీ మున్సిపాలిటీగా మారితే జరిగే అభివృద్ధి ఏమీ ఉండదని, పైగా ప్రజలపై పన్నుల భారం విపరీతంగా పడుతుందనే భావన ప్రజల్లో వినిపిస్తుంది. మున్సిపాలిటీ అయితే సరుకుల ధరలు పెరగడం, ఖాళీ స్థలాల్లో పన్నుల భారం, ప్రతి ఒక్క దానికీ అదనపు పన్నుల భారం వంటి ఆర్థికపరమైన సమస్యలు ప్రజలకు ఏర్పడనున్నాయి. మున్సిపాలిటీగా మారినా ప్రజల జీవన సరళి మారకపోవడం, కొనుగోలు శక్తి పెరగకపోవడం, ఆదాయ వనరులు తగ్గిపోవడం వంటి ఇబ్బందులతో ప్రజలు మున్సిపాలిటీ అయితే ఎదుర్కోనున్నారు. దీనికి తోడు ఇంటింటికీ కుళాయిలు వచ్చి తాగునీటి సమస్య పరిష్కారం జరగవచ్చుననే భావనలో ప్రజలు ఉంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ తాగునీటి సమస్య తీరుతుంది. మున్సిపాలిటీగా మారితే రోడ్లు విస్తారణ జరుగుతుంది. కాలువలు అభివృద్ధి చెందుతాయనే నమ్మకం ఉంది. ప్రస్తుతం మంత్రి అచ్చెన్నాయుడు హయాంలో ఇప్పటికే టెక్కలి రోడ్లు విస్తారంగా మారాయి. కాలువలు కూడా నిర్మించారు. ఒకపక్క అభివృద్ధి చెందుతున్న సమయంలో టెక్కలిని మున్సిపాలిటీ మార్చడం ఎందుకనే వాదనని పలువురు వ్యక్తపరుస్తున్నారు. ఇదిలా ఉండాగా టెక్కలి మున్సిపాలిటీ ఏర్పాటై తమకు ఎటువంటి అభ్యంతరం లేదని ఆమోదం తెలిపిన పంచాయతీలు ఇప్పటికే టెక్కలి విస్తరణలోను, అభివృద్ధిలో విలీనమయ్యాయి. మరి అటువంటప్పుడు టెక్కలి మున్సిపాలిటీ మారే అవకాశం ఎందుకని, మేజర్ పంచాయతీగా ఉంటే చాలు కదా? అనే వాదనని పలువురు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మంత్రి ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.



టెక్కలి వ్యూ

ముస్సిపాలిటీ వల్ల లాభం లేదు



టెక్కలి ముస్సిపాలిగా మారితే వచ్చే లాభం ఏమీ లేదు. తిరిగి ప్రజానీకం పలు అవస్థలను ఎదుర్కొంటారు. ఇప్పటికే ముస్సిపాలిటీలుగా పలాస, ఆముదాలవలస పట్టణాలను చూస్తున్నాం. టెక్కలి మేజర్ పంచాయతీ ఉంటే చాలు. గతంలో వచ్చిన ప్రతిపాదనలు అప్పటికీ అవసరం కావచ్చు. కానీ, ఇప్పటి పరిస్థితులకైతే మాత్రం అక్కరల్లేదు. టెక్కలి పట్టణాన్ని విస్తరించి అభివృద్ధి చేస్తు చాలు

– టంకాల బాల గంగాధర్‌గుప్త, మాజీ ఉప సర్పంచ్, టెక్కలి

మంత్రి నిర్ణయమే శిరోధార్యం



వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిర్ణయమే తమకు శిరోధార్యం. అచ్చెన్నాయుడు మంత్రి హోదాలో తీసుకునే నిర్ణయాలను ప్రజలు ఆమోదంపజేస్తారు. అయితే మంత్రి హయాంలో టెక్కలి రూపురేఖలు మారాయి. మున్సిపాలిటీ కాకపోయినా అంతకన్నా ఎక్కువగానే అభివృద్ధి జరుగుతుంది. అన్ని వసతులు, సౌకర్యాలు టెక్కలిలోనే ఉన్నాయి.

– బగాది శేషగిరి, టిడిపి మండల అధ్యక్షులు

పలువురు ఐఎఎస్‌ల బదిలీ

- జెసిగా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్
- ఆర్థికశాఖ డిప్యూటీ కార్యదర్శిగా నూరుల్ కమల్
- మార్క్‌ఫెడ్ ఎం.డిగా మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో పలువురు ఐఎఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మరోసారి భారీగా ఐఎఎస్‌లను బదిలీ చేస్తూ శనివారం జిఒ నంబరు 1288 విడుదల చేసింది. జిల్లా జెసిగా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ నియమితులయ్యారు. ఎపి కేడర్‌కు చెందిన ఈయన 2019 సివిల్స్ 258 ర్యాంకు సాధించారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా జెసిగా విధులు నిర్వర్తిస్తున్నారు. అప్పటివరకు రాజంపేట సబ్ కలెక్టర్‌గా పనిచేసిన ఆయన్ను గతేడాది మేలో అన్నమయ్య జిల్లా జెసిగా ప్రభుత్వం నియమించింది. జిల్లా కలెక్టర్‌గా బదిలీ పోస్టింగ్ కోసం వేచి చూస్తున్న డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను ఎపి మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది.



ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

సిఆర్‌డిఎ అదనపు కమిషనర్‌గా నవీన్

జెసి ఎం.నవీన్‌ను సిఆర్‌డిఎ అదనపు కమిషనర్‌గా నియమించింది. అనంతపురం జిల్లా పెనుకొండ సబ్ కలెక్టర్‌గా అప్పటివరకు పనిచేస్తున్న జెసి నవీన్ 2022 అక్టోబరులో జిల్లాకు బదిలీపై వచ్చారు.

ఆర్థికశాఖ డిప్యూటీ కార్యదర్శిగా నూరుల్ కమర్

టెక్కలి సబ్ కలెక్టర్‌గా పని చేస్తున్న నూరుల్ కమర్‌ను ఆర్థికశాఖ డిప్యూటీ కార్యదర్శిగా నియమించింది. ఆయన స్థానంలో కొత్తగా ఎవరినీ నియమించలేదు. గతేడాది డిసెంబరు 5న టెక్కలి సబ్‌కలెక్టర్‌గా నియమితులయ్యారు.



బదిలీ అయిన నవీన్



నూరుల్ కమర్

ఎపి న్యూస్ కథనాలు అభూత కల్పనలు

సిపిఎం ఖండన

శ్రీకాకుళం : సిపిఎం, ఆ పార్టీ జిల్లా కార్యదర్శిపై ఎపి న్యూస్ ప్రచురించిన కథనాలు అభూత కల్పనలు అని సిపిఎం శ్రీకాకుళం జిల్లా కమిటీ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. నిరాధార ఆరోపణలతో గత కొన్ని రోజులుగా ఆ పత్రిక అభూత కల్పనలతో కథనాలు ప్రచురిస్తోందని పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు పేర్కొన్నారు. వాటిని ఖండించి, బేషరతుగా క్షమాపణ చెప్పాలని సదరు పత్రిక ఎడిటర్, వర్కింగ్ ఎడిటర్‌కు లీగల్ నోటీసు పంపినట్లు తెలిపారు. నోటీసుకు సమాధానం ఇవ్వకుండా మళ్లీ అవే తప్పుడు రాతలను ప్రచురించడం తగదని పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పార్టీ జమా ఖర్చులు పారదర్శకంగా ఉంటాయని స్పష్టం చేశారు. అన్ని పద్ధతులు పాటిస్తుండగా దురుద్దేశాలతో నిరాధారమైన వార్తా కథనాలను ప్రచురించడం సరికాదని పేర్కొన్నారు. పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకుల పేర్లు, ఫొటోలు చొప్పించి దుష్ప్రచారానికి పూనుకోవడం తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. అంతేకాకుండా పత్రికా స్వేచ్ఛను పూర్తిగా అపభ్రంశం చేయడమేనని పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన లీగల్ నోటీసుకు సమాధానం ఇవ్వాలని, ఈ నెల 19న వచ్చిన కథనాన్ని ఖండిస్తూ వార్త ప్రచురించాలని ఆ పత్రిక ఎడిటర్, పబ్లిషర్, యాజమాన్యాన్ని కోరారు. పత్రికా స్వేచ్ఛను దుర్వినియోగం చేసే ఇటువంటి ప్రయత్నాలను ఇతర మీడియా సంస్థలు, పాత్రికేయ మిత్రులు నిరసించాలని కోరారు. ఎపి న్యూస్ పత్రిక వైఖరి ఇలాగే కొనసాగితే వారిపై తదుపరి న్యాయపరమైన చర్యలకు పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై దృష్టి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మాదక ద్రవ్యాలను నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, అదనపు ఎస్‌పి ప్రేమ్‌కాజల్ అధ్యక్షతన పిల్లల్లో డ్రగ్స్ వాడకాన్ని నియంత్రించేందుకు జిల్లాస్థాయిలో సంయుక్త కార్యాచరణ రూపొందించేందుకు జిల్లాస్థాయి కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై కేంద్రంలో సమావేశం నిర్వహించారని తెలిపారు. అన్ని రాష్ట్రాల నుంచి కమిషన్ అధ్యక్షులు హాజరయ్యారని, ఎపి నుంచి తాను పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించినట్లు చెప్పారు. యువతీ, యువకులు మాదకద్రవ్యాలు తీసుకుంటున్నారని, దీనిని తక్షణమే నియంత్రించేందుకు అందరూ దృఢ సంకల్పంతో పనిచేయాలన్నారు. జిల్లాలో ఏ పని ప్రారంభించినా విజయవంతమవుందనే పేరుందన్నారు. సమస్యలు, నియంత్రణ చర్యలకు సూచనలు, సలహాలు ఇవ్వాలని అన్నారు. జిల్లా నుంచి రిపోర్టు తయారు చేస్తే ఆ రిపోర్టును రాష్ట్రంలో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా శాఖలు చేయవలసిన విధులు సక్రమంగా నిర్వహిస్తే కొంత వరకు నియంత్రించవచ్చునన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు మాట్లాడుతూ డ్రగ్స్ అనేవి కుటుంబ విలువలకు భంగం వాటిల్లుతుందన్నారు. ఆ విలువలు కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యా వ్యవస్థపైనా దృష్టి సారించి ఎవరి పాత్ర వారు పోషించాలని కోరారు.

వసతిగృహాల్లో ఆల్కహాల్, మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషన్ సభ్యులు గొండు సీతారాం చెప్పారు. పిల్లల్లో అవగాహనా కార్యక్రమాలు చేస్తున్నది లేనిది ఆయన ఆరా తీయాలని గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావుకు సూచించారు. వసతిగృహాల్లో పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సంక్షేమ అధికారులు వసతి గహాల్లో పక్కాప్రణాళికతో నియంత్రణకు చర్యలు తీసుకుంటామని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు తావుండరాదని స్పష్టం చేశారు. కమిషన్ ఛైర్మెన్ కేసలి అప్పారావు స్పష్టం చేశారు. జిల్లాలో ఉన్న మెడికల్ షాపులు, సిసి కెమేరాలు గురించి కమిషన్ చైర్మన్ అడుగగా, డ్రగ్స్ కంట్రోల్ శాఖ ఎడి చంద్రరావు మాట్లాడుతూ జిల్లాలో 1370 షాపులు ఉండగా 950 షాపుల్లో సిసి కెమేరాలు ఉన్నట్టు చెప్పారు. సినిమా థియేటర్లల్లో స్లైడ్స్ వేయించాలని అన్నారు. దీనిపై సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కె.చెన్నకేశవరావు మాట్లాడుతూ సినిమా థియేటర్లలో స్లైడ్స్ వేసేందుకు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి థియేటర్లకు ఆదేశాలు ఉండాలని చెప్పారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ల, ఎంపిడిఒల కార్యాలయాల్లో మాదక ద్రవ్యాల నిరోధంపై బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. రైల్వే స్టేషన్ ప్రాంతంలో అవగాహన కల్పిస్తున్నట్లు రైల్వే ఎస్ఐ చెప్పారు. ఆర్‌టిసిలో మాదక ద్రవ్యాల రవాణాపై సంబంధిత డ్రైవర్లు కండక్టర్లుకు, పార్శిల్ సర్వీసులకు సంబంధించి సిబ్బందికి ఇప్పటికే సూచించినట్లు ఆర్ఎం వివరించారు. కెజిబివిల్లో సిసి కెమేరాలు ఏర్పాటు, బ్యాగులు చెక్ చేస్తున్నట్లు ఎపిసి వివరించారు. అలాగే కెజిబివిల్లో సీట్ల కేటాయింపుపై సీతారాం ఆరా తీశారు. సీట్లు పెంచమని కేంద్ర మంత్రికి లేఖ పంపడమైనదని కేసలి అప్పారావు చెప్పారు. జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్కూల్స్, కళాశాలల వద్ద ఉన్న పాన్‌షాప్ వద్ద గట్టి నిఘా పెట్టాలని సూచించారు. సమావేశంలో బాలల సంక్షేమ సమితి కమిటీ చైర్‌పర్సన్ యు.శ్రీలక్ష్మి, కమిటీ సభ్యులు వి.రమణమూర్తి, ఎం.గన్నప్పడు, సెబ్ అదనపు ఎస్‌పి గంగాధరం, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, డిఇఒ వెంకటేశ్వరరావు, మహిళా శిశుసంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ, ఆర్ఐఒ దుర్గారావు, సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి జయప్రకాష్, ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ సుబ్బారావు, ఎన్‌సిసి నుంచి సుబేదర్ బి.శ్రీనివాసరావు, జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి.రమణ పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న అప్పారావు

జవాన్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- నౌపడ

ఉగ్రవాదుల కాల్పుల్లో వీర మరణం పొందిన సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రకు చెందిన ఆర్మీ జవాన్ డొక్కరి రాజేష్ కుటుంబానికి ఆర్మీ అధికారులు శనివారం పరామర్శించారు. తక్షణ సాయం కింద చెక్కును అందజేశారు. వీర జవాన్ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ ఎం.కె.జె.సాబ్, గోపాల్పూర్ ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ సెంటర్ నుంచి వచ్చిన కమాండింగ్ ఆఫీసర్ ఎ.ఎస్.బద్వాల్, నాయక్ రాజశేఖర్ జవాన్ కుటుంబానికి పరామర్శించారు. ఆయన కుటుంబానికి తాము అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయ సహకారాలను త్వరగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆర్మీ అధికారులతో పాటు శ్రీకాకుళం ఆర్‌డిఒ రంగయ్య, టెక్కలి డిఎస్‌పి బాల చంద్రారెడ్డి, మాజీ సైనికుల జిల్లా అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు కటకం, పైడి మురళి, తాండ్ర జనార్థన్, మాజీ సైనికుల టెక్కలి అధ్యక్షుడు గొనప సోమేష్, కంచరాన మన్మథ, సర్పంచ్ పంగ అసిరినాయుడు ఉన్నారు.



పరామర్శిస్తున్న ఆర్మీ అధికారులు



పోలాకి మండలం పల్లెపేటలో నీట మునిగిన పంట పొలాలు

ముంచెత్తిన వాన

- పంట పొలాల్లో భారీగా చేరిన వర్షపు నీరు
- ఎల్ఎన్‌పేటలో ఇళ్లలోకి నీరు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి


బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అర్ధరాత్రి తీరం దాటడంతో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. పలుచోట్ల పొలాల్లోకి భారీగా వరద నీరు చేరింది. పొలాకిలో వరి పొలాల్లోకి భారీగా వరద నీరు చేరడంతో నారుమళ్లు దెబ్బతిన్నాయి. ఎల్ఎన్‌పేటలో కొండవాగు పొంగిపొర్లడంతో రోటరీనగర్ ప్రాంతంలోకి భారీగా వరద నీరు చేరింది. మిగిలిన ప్రాంతాలు వరదబారిన పడకుండా అధికారులు కాలువగట్లకు అడ్డంగా అధికారులు ఇసుక బస్తాలు వేయించారు. వర్షాలు విస్తారంగా పడటంతో శనివారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. వాయుగుండం తీరం దాటడంతో దాని ప్రభావం చూపలేదు. జిల్లాలో సగటున 3.1 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆమదాలవలసలో అత్యధికంగా 21.75 మి.మీ వర్షం కురిసింది. కవిటి మండలం రాజపురంలో 10.75 మి.మీ వర్షం పడింది. ఇచ్ఛాపురంలో 8 మి.మీ, నందిగాంలో 5.5 మి.మీ, హిరమండలం 5.25 మి.మీ వర్షం కురిసింది. ఒడిశాలో పెద్దగా వర్షాలు కురవకపోవడంతో వంశధార, నాగావళి నదులు సాధారణ స్థితిలోనే ప్రవహిస్తున్నాయి.

సరికొత్త ఫీచర్లతో ఇపిడిసిఎల్ మొబైల్ యాప్

సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్‌ను సరికొత్త ఫీచర్లతో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా సర్కిల్ సూపరెంటెండెంట్ ఇంజినీర్ ఎన్.కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్ డౌన్‌లోడు చేసుకొని వినియోగదారుని 16 అంకెల సర్వీసు నంబరు నమోదు చేసుకోవడం ద్వారా మొబైల్ యాప్ సేవలను పొందవచ్చన్నారు. ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్ లో 'బిల్ పే' ఆప్షన్ ద్వారా ద్వారా విద్యుత్ బిల్లులను ఎటువంటి అదనపు రుసుం లేకుండా అత్యంత సులభతరంగా చెల్లించవచ్చ న్నారు. అంతేకాకుండా వినియోగదారుని సర్వీసుకు సంబందించిన విద్యుత్ వినియోగం, బిల్లు వివరాలు, బిల్లు చెల్లింపు, విద్యుత్ సరఫరా పరిస్థితి వివరాలు తెలుసుకోవచ్చున్నారు. 'మై యుసెజ్' ఆప్షన్ ద్వారా విద్యుత్ మీటర్‌లోని రీడింగ్ ప్రకారం కేవలం ప్రస్తుత వినియోగపు యూనిట్ల సంఖ్యను నమోదు చేయడం ద్వారా విద్యుత్ బిల్లును వినియోగదారులే యాప్ ద్వారా లెక్కించుకోవచ్చన్నారు. యాప్ ద్వారా ఆధార్ నంబర్‌కు విద్యుత్ సర్వీసును అనుసం ధానం చేసుకోవడంతోపాటు విద్యుత్ సంబంధిత సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. పేటీఎం, ఫోన్ పే, జీ పే తో సహా ఇతర యూపిఐ యాప్‌ల ద్వారా బిల్లులు నేరుగా చెల్లించే విషయమై ఆర్‌బిఐ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ పాత విధానంలోనే నేరుగా ఫోన్ పే, పేటీఎం, జీ పేల ద్వారా వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వీలుగా బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. సంస్థ వెబ్‌సైట్ www.apeasternpower.com నుంచి కూడా బిల్లులు చెల్లించవచ్చన్నారు. ఎపిడిపిడిసిఎల్ మొబైల్ యాప్‌లో గాని, సంస్థ వెబ్‌సైట్‌లో గాని బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోన్ పే, జీ పే, పేటిఎం, ఇతర యూపిఐ యాప్స్‌తో పాటు నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ కూడా వాడుకోవచ్చని తెలిపారు.



కార్పొరేట్లకు బాబు తాపత్రయం

ప్రజాశక్తి- శ్రీకాకుళంప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వానికి పోర్టులు, ఎయిర్‌పోర్టులపై ఎక్కువ తాపత్రయం కనిపిస్తోంది. సంక్షేమ పథకాల అమలుపై అన్నీ ఒకేసారి చేసేయలేమని చెప్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్పొరేట్ల విషయానికి వచ్చేసరికి చాలా వేగంగా అడుగులు వేస్తున్నట్లుగా ప్రభుత్వ చర్యలను బట్టి తెలుస్తోంది. పొరుగు జిల్లా భోగాపురంలో ఎయిర్‌పోర్టును జూన్ 2026 నాటికి పూర్తిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల సంబంధిత నిర్మాణ సంస్థ జిఎంఆర్‌కు సూచించిన విషయం తెలిసిందే. ఇది ఇలా ఉండగా రాష్ట్రంలో కుప్పం, సంతబొమ్మాళి మండలం మూలపేట తదిరత ఆరు ప్రాంతాల్లో మినీ ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వాన్ని కోరడంతో అవీ మంజూరైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే మూలపేటలో పోర్టు పనులు జరుగుతున్నాయి. పోర్టుకు సమీపంలోనే ఎయిర్‌పోర్టునూ నిర్మించాలని కూటమి ప్రభుత్వం సంకల్పించినట్లు తెలుస్తోది. మూలపేట పోర్టు నిర్మాణం కోసం గత వైసిపి ప్రభుత్వం తొలి దశలో వెయ్యి ఎకరాలను తీసుకుంది. తర్వాత క్రమేణా విస్తరణ పేరుతో మరిన్ని ఎకరాలను సేకరించాలని అనుకుంది. వైసిపి అధికారం కోల్పోవడంతో ఇప్పుడు ఆ పనిని టిడిపి కూటమి ప్రభుత్వం తీసుకునేందుకు సిద్ధమైనట్లుగా తెలుస్తోంది. వాస్తవానికి భావనపాడు పోర్టు నిర్మాణ పనులను 2014-19 కాలంలో టిడిపి ప్రభుత్వమే తెరపైకి తెచ్చింది. పోర్టు నిర్మాణం కోసం రైతులకు, మత్స్యకారులకు తెలియకుండానే ఐదు వేల ఎకరాలతో భూసేకరణ నోటిఫికేషన్‌ను వెలువరించి వారి నుంచి తీవ్ర ఆగ్రహాన్ని చవిచూసింది. పోర్టుకు వ్యతిరేకంగా ప్రజల నుంచి తిరుగుబాటు, కొందరు రైతులు కోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వం కొద్దికాలం వెనక్కి తగ్గింది. తర్వాత 2019 జనవరిలో శంకుస్థాపనకు సైతం సిద్ధమైనా అదానీ సంస్థ పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో ఆగింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి వ్యూహాత్మకంగా వ్యవహరించి ప్రారంభంలోనే పెద్దఎత్తున భూములు తీసుకుని స్థానికుల ఆగ్రహానికి గురి కాకుండా తొలివిడతలో వెయ్యి ఎకరాలకు భూమిని సేకరించడం, పనులు మొదలు కావడం తటస్థించింది. గత ప్రభుత్వం పోర్టు నిర్మాణ బాధ్యతలనూ మారిటైం బోర్డుకు అప్పగించిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమూ దీనిని వేగవంతం చేసే ప్రక్రియపై దృష్టి సారించినట్లుగా కనిపిస్తోంది. కొత్త ప్రభుత్వం నిర్వహణ బాధ్యతలను ఎవరికి అప్పగించబోతుందో వేచిచూడాల్సి ఉంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు 4పి (పబ్లిక్, ప్రయివేట్, పీపుల్ పార్టనర్ షిప్) పేరుతో కొత్త విధానం తీసుకొచ్చారు. ఇందులో పిపుల్ (ప్రజలు) పేరుతో తనకు కావాల్సిన వారికి, కార్పొరేట్లకు వాటా కల్పిస్తారా? అనే చర్చ సాగుతోంది.

పోర్టు నిర్మాణ పనులు ఊపందుకోనున్న నేపథ్యంలో వాటాదారులు, సంస్థల ప్రతినిధులు మూలపేట పోర్టుకు వచ్చి పరిశీలన చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో అక్కడా ఒక ఎయిర్‌పోర్టు నిర్మించేస్తే ఒక పనైపోతుందని ప్రభుత్వం అనుకుంటోంది. అందులో భాగంగానే మూలపేటలో మినీ ఎయిర్‌పోర్టు నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని సైతం ఒప్పించింది. దీనిని గుట్టుగా చేద్దామని బాబు భావిస్తే బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి ట్వీట్‌తో ఈ విషయం బట్టబయలైంది. మినీ ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం సుమారు 2 వేల ఎకరాల భూమి అవసరం పడొచ్చనేది అధికారుల అంచనాగా ఉంది. దీంతో ఎవరి భూములకు ఎసరు వస్తుందో, ఎంత మంది నిరాశ్రయులు కావాల్సి వస్తుందోనన్న భయం అప్పడే ఈ ప్రాంతంలో మొదలైంది. అసలు ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు అవసరమా! అన్న చర్చ జిల్లాలో ప్రారంభమైంది. జిల్లా వాసుల్లో ఎంత మందికి విమానంలో ప్రయాణించే ఆర్థిక స్థోమత ఉందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఉపాది దొరక్క వేలాది మంది పొట్ట చేతితో పట్టుకుని వలసలు వెళ్లిపోతుంటే పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తామని చెప్పడం టిడిపి కూటమి ప్రభుత్వానికే చెల్లింది. పోనీ జిల్లా నుంచి విశాఖ ఎయిర్‌పోర్టు ద్వారా నిత్యం విమానంలో ప్రయాణించే వారు పెద్ద సంఖ్యలో ఉన్నారంటే అదీ లేదు. వెనుకబడిన జిల్లాలో పోర్టులు, ఎయిర్ పోర్టులు నిర్మించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నామని ప్రజలను భ్రమల్లో ముంచడానికి తప్ప వాటితో సామాన్య ప్రజలకు ఏం ఒరుగుతుందో పాలకులకు మాత్రం తెలియదా? అభివృద్ధి పేరుతో కార్పొరేట్లకు, సంపన్నులకు మేలు చేయడానికే ఈ తాపత్రయమంతా అనే విషయాన్ని అంతా ప్రజలు అర్థం చేసుకుంటున్నారు.

వెనుకబడిన జిల్లా అంటూ ముసలికన్నీరు కార్చడం కంటే ప్రజలకు మేలు చేసే ప్రాజెక్టులు, పథకాలను అమలు చేస్తే కొంత వరకైనా వారికి మేలు జరగుతుంది. జిల్లాలో వంశధార, ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిగో అదిగో నీళ్లిస్తామంటూ పదేళ్లుగా పాలకులు చెప్తూనే ఉన్నా పనులు మాత్రం పూర్తి కావడం లేదు. తోటపల్లి కొత్త ఆయకట్టు పనులు, వంశధార, నాగావళి హైలెవెన్ కెనాల్ పనులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టులకు తగినంత నిధులు కేటాయించకపోవడం, అధికారంలోకి వచ్చిన తర్వాత తమ సొంత మనుషులకు, సంస్థలకు కాంట్రాక్టులు అప్పగించడంతో ప్రాజెక్టులన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి. పైగా అంచనా వ్యయం విపరీతంగా పెరుగుతోంది. ప్రాజెక్టులను పూర్తి చేసి రెండు పంటలకు నీళ్లివ్వగలిగితే పంట దిగుబడులు పెరిగి రైతుల ఆదాయం మెరుగవుతుంది. తద్వారా కొనుగోలు శక్తి పెరిగి జిల్లా ఆర్థికాభివృద్ధికి దారి తీస్తుంది. వీటిని విస్మరించి పోర్టులు, ఎయిర్ పోర్టుల పేరుతో రైతుల నుంచి పచ్చని భూములు తీసుకుని వారిని వ్యవసాయానికి దూరం చేస్తే వలసలే గతి. కూటమి ప్రభుత్వం ఇప్పటికయినా ప్రజలకు ఏం కావాలో అది చేయడం రాష్ట్రానికి, జిల్లాకు ప్రయోజనకరం.


వర్షప్రియ అభినందిస్తున్న ఐతమ్ డైరెక్టర్ నాగేశ్వరరావు

'ఇండియా బుక్'లో ఐతమ్ విద్యార్థినికి స్థానం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ తృతీయ ఏడాది ఇసిఇ చదువుతున్న బోటు వర్షప్రియ ప్రతిష్టాకరమైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ స్థానం సంపాదించడం అబ్బురపరిచే అంశమని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు కళాశాలలో శనివారం ఆమెను అభినందించారు. హర్యానాలోని ఫరీదాబాద్ కేంద్రంగా 2006లో స్థాపించిన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం పొందాలంటే ఏదైనా ఒక విషయంలో అత్యంత ప్రతిభ కనపరచాలన్నారు. వర్షప్రియ 17.15 నిమిషాల్లో పెన్సిల్ లీడ్ (ముల్లుపై) ఎ నుండి జడ్ వరకు గల 26 అంకెలను బ్లేడ్ సహాయంతో చెక్కడం వల్ల ఇండియా బుక్ స్థానం సంపాందించందన్నారు. డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సిఇసి హెచ్‌డి డాక్టర్ వి.అశోక్‌కుమార్, డాక్టర్ కె.లలితాభవానీ, అధ్యాపకులు అభినందించారు.


డైరీని ఆవిష్కరిస్తున్న డిఇఒ వెంకటేశ్వరరావు

బిఎస్‌టిఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జీవశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం అకడమిక్‌గా జీవశాస్త్ర ఉపాధ్యాయులకు సహకారం అందించడం అభినందనీయమని డిఇఒ వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా విద్యాశాఖ వారి కార్యాలయంలో ఎపి జీవశాస్త్ర ఉపాధ్యాయుల డైరీని ఆయనతో పాటు జిల్లా సైన్స్ అధికారి నల్ల కుమారస్వామి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, ఎపిబిఎస్‌టిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుట్టా ఉదయ్‌కుమార్, పూజారి గోవిందరావు జిల్లా అకాడమిక్ సెల్ నాయకులు జి.మోషే, నాగరాజుల సమక్షంలో శనివారం ఆవిష్కరించారు.

నేడు ప్రాంతీయ సమావేశం

ఈ నెల 21న ఉదయం 10 గంటలకు సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనూ మధ్యాహ్నం 2 గంటలకు కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ జీవశాస్త్ర ఉపాధ్యాయుల సమావేశాలను నిర్వహిస్తున్నామని, పరిసర మండలాల్లోని జీవశాస్త్ర ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని గిరిధర్, ఉదయ్ కుమార్, గోవిందరావు కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న విఒఎలు

రాజకీయ వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వెలుగు డిపార్‌మెంట్‌లో ఇరవై ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న విఒఎలపై రాజకీయ వేధింపులు ఆపాలని సిఐటియు నాయకులు నెయ్యిల మోహనరావు డిమాండ్ చేశారు. మండల విఒఎలతో కలిసి ఎమ్మెల్యే గౌతు శిరీషను ఆమె స్వగృహంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదుపు సంఘాల అభివృద్ధిలో విఒఎల పాత్ర కీలకమని అన్నారు. డ్వాక్రా మహిళలకు అప్పులు ఇప్పించడం వాటి వసూళ్లు చేయడం, బుక్ కీపింగ్, సమావేశాలు నిర్వహించడం వంటి విధుల్లో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధికి పాటుపడుతున్న వారిపై రాజకీయాలు తగవన్నారు. కార్యక్రమంలో ఎన్.ధనలక్ష్మి, డి.హేమలత, ఎం.విజయ, ఎ.రత్నాలు, శోభారాణి, డి.సరస్వతి, బి.ఝాన్సీ పాల్గొన్నారు.


విచారణ చేస్తున్న ఎంపిడిఒ రఘుపతిరావు

సతీష్‌బాబుపై కొనసాగుతున్న విచారణ

ప్రజాశక్తి- మందస, కవిటి

ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన మందస మండలం లోహరిబంద పంచాయతీ కార్యదర్శి మన్నం సతీష్‌బాబుపై విచారణ కొనసాగుతోంది. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు మందస ఎంపిడిఒ రఘుపతిరావు శనివారం విచారణ చేపట్టారు. ఈ విచారణలో శ్రీకాకుళం, కవిటి నుంచి పలువురు బాధితులు పాల్గొని తమ వాంగ్మూలం అందజేశారు. మరోవైపు విచారణలో పాల్గొన్న సతీష్‌బాబు మాత్రం పొంతన లేని సమాధానాలు చెబుతూ సోమవారం వరకూ గడువు అడగడం విశేషం. అనంతరం ఇరువురి వాదనలు విన్న ఎంపిడిఒ రఘుపతిరావు పూర్తి వివరాలతో కూడిన నివేదిక జిల్లా పంచాయతీ అధికారికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ విచారణలో ఎఒ బి.రుషేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ హెచ్.సురేష్ పాల్గొన్నారు.

నీట మునిగిన వెదలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో మండలంలోని కనుగులవలస, తమ్మయ్యపేట, ముద్దాడ పేట, కొర్లకోట, చీమలవలస, కొత్తవలస, తొగరాం, కలివరం గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల్లో ఉన్న వరి చేలు వరద నీటిలో మునిగాయి. ఈ ఏడాది ఖరీఫ్ సాగులో భాగంగా రైతులందరూ వరి వెదలు జల్లి ఆశాజనకంగా మొలకలు రావటంతో ఆనందంగా ఉన్న తరుణంలో గడచిన రెండు రోజులుగా కురిసిన వర్షాలతో పాటు శుక్రవారం రాత్రి 63 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో పలు ప్రాంతాలకు చెందిన పంట పొలాల్లో భారీస్థాయిలో నీరు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పూర్తిస్థాయిలో వరిచేలు నీటిలో ఉండడంతో వర్షం ఆగిన తర్వాత నీటి పరిస్థితి తగ్గినప్పటికీ అప్పటివరకు నీటిలో ఉండిపోయిన వరిచేలు ఏ స్థాయిలో పంటకు అనుకూలంగా ఉంటాయోనని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


కనుగులవలస వద్ద నీట మునిగిన పంట పొలాలు

ఫీల్డ్ అసిస్టెంట్లను ఎలా తొలగిస్తారు?

మండల సమావేశంలో సభ్యుల ధ్వజం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఉపాధిహామీ చట్టంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలా తొలగించారని ఎంపిపి రోణంకి ఉమామహేశ్వరరావు, సభ్యులు ప్రశ్నించారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి ఉమామల్లేశ్వరరావు, ఎంపిడిఒ వై.పద్మజ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈ విషయంపై ఉపాధిహామీ ఎపిఒను ప్రశ్నిస్తామని సమావేశానికి రాకుండా కడుపునొప్పి అని చెప్పి ఇసి రాంబాబుకు పంపించారని మండల విఫ్ బొడ్డు అప్పన్నతో పాటు పలువురు సభ్యులు ప్రశ్నించారు. ఎవరైనా ఫీల్డ్ అసిస్టెంట్ తప్పచేస్తే తొలగించాలని, ఇలా ఎటువంటి సమాచారం, నోటీసు లేకుండా సంబంధిత పంచాయతీ ప్రజాప్రతినిధులకు తెలుపకుండా టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వీరిని తొలగించటం అన్యాయమన్నారు. వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు మాట్లాడుతూ రైతులందరికి ఖరీఫ్‌కు సంబంధించి యురియా, డిఎపి ఎరువులు సిద్దంగా ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోటబొమ్మాళి పంచాయతీలో వైసిపికి ఓటు వేశారనే అక్కసుతో రెడ్డికవీధి, పట్నాయకుల వీధి, సీతన్నపేట తదితర వీధుల్లో ఇంటి ముందు ఉన్న మంచినీటి కొళాయిలను ఇఒ తొలగించారని ఎంపిడిఒకు ఎంపిపి బోయిన నాగేశ్వరరావు వివరించారు. గ్రామాల్లో పశువులకు ఎటువంటి వ్యాధి సోకకుండా వేస్తున్న


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి ఉమ

నివారణ టీకాలను పాడి రైతులు తప్పక వేయించాలని పశు వైద్యాధికారి ఎల్.కిరణ్‌కుమార్ తెలిపారు. కొత్తపేటలో అంగన్వాడీ కేంద్రాలకు మంచినీటి సౌకర్యాం కల్పించాలని వైఎస్ ఎంపిపి దుక్క రోజారామకృష్ణ ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కావ్యశ్రీకి వివరించారు. సమావేశంలో గృహనిర్మాణ శాఖ ఎఇ రెడ్డి పాపినాయుడు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన

ఇచ్ఛాపురం : ప్రకృతి వ్యవసాయం ద్వారా పెరటి తోటల పంట పొలాల్లో కాయగూరలు సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి రేవతి అన్నారు. మండలంలోని మశాఖపురంలో నవధాన్యాల ద్వారా పండించే పంటలను శుక్రవారం పరిశీలించారు. ఎటిఎం మోడల్ కూరగాయలు పెంపకం వల్ల తక్కువ పెట్టుబడులు ఎక్కువ ఆదాయం పొందవచ్చు అన్నారు. రైతులు గట్టు వెడల్పు చేసి గట్టుపైన ఆదాయం పొందవచ్చని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం సిహెచ్.ఆర్.శ్రీనివాస్, సూర్యనారాయణ, మెంటర్ సత్యనారాయణ, నాగమణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సైనిక సంక్షేమ జిల్లా అధికారి శైలజ

మార్పులు, చేర్పులకు అవకాశం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైనిక బోర్డు డాక్యుమెంటేషన్‌లో ఎటువంటి తప్పులు నమోదైనా వాటిని సరిచేసే అవకాశం వచ్చిందని ఈ అవకాశాన్ని మాజీ సైనికులు, సైనికులు వినియోగించుకోవాలని జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి శైలజ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రైవేట్ కల్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నియోజకవర్గ మాజీ సైనిక అధ్యక్షులు సూర అవతారం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెన్షన్ పేమెంట్ అథారిటీ డాక్యుమెంటేషన్‌లో తప్పులు ఉంటే నేరుగా జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయాన్ని సంప్రదించి సవరణ చేసుకోవాలని సూచించారు. పిపిఒలో త్వరలో స్పర్శ ద్వారా నమోదు ఉంటుందని అందుకు ఆధార్‌లో ఉండేలా పేర్లు, వయసు వంటి మార్పులు చేసుకోవాలని సైనికులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధ్యక్షులు కటకం పూర్ణ చంద్రరావు, బర్రి సంజీవరావు, జగన్నాథం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ

పారిశుధ్య మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి- కవిటి

భారీ వర్షాల నేపథ్యంలో తీరప్రాంత గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలం ఇద్దివానిపాలెం, కొత్తపాలెం గ్రామాలు, కొత్తపాలెం కెజిబివి సందర్శించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. అంతకు ముందు మండల అధికారులతో సమావేశమై భారీవర్షాల నేపథ్యంలో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాలువల్లో పూడికలు తొలగించి నీటి ప్రవాహం సరిగా జరిగేలా చూడాలని ఆదేశించారు. కార్యదర్శులు పంచాయతీల పరిధిలో అందుబాటులో ఉంటూ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు తమ పరిధిలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంఇఒ ధనుంజయ మజ్జి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, జెఇ ప్రవీణ్ కుమార్, ఇఒ వీరభద్ర స్వామి, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


దీర్ఘాశిలో బాలికను పరిశీలిస్తున్న సురేష్‌కుమార్

ఎల్‌సిడిసి సర్వే వేగవంతం

ప్రజాశక్తి- పోలాకి

ఎల్‌సిడిసి సర్వేను ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పక్కాగా నిర్వహించాలని, సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్ కుమార్ సూచించారు. శనివారం మండలం దీర్ఘాసిలో జరుగుతున్న ఇంటింటా సర్వేను పరిశీలించారు. రోజుకు 20 ఇళ్ల చొప్పున ఆగస్టు 2 నాటికి సర్వే పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. సర్వేలో వెలుగుచూసిన అనుమానిత రోగుల వివరాలను ప్రతిరోజు పిహెచ్‌సి వైద్యాధికారికి తెలియజేయాలని సూచించారు. ప్రతి ఆశా కార్యకర్త సర్వేలో ఒక అనుమానిత కేసును తప్పనిసరిగా నమోదుచేయాలని, జిరో రిపోర్ట్ ఇవ్వడానికి వీల్లేదన్నారు. మొదటి రెండు రోజుల సర్వే పూర్తైన నాటికి జిల్లాలో 2 కొత్త లెప్రసీ కేసులను గుర్తించడం జరిగిందని, వారికి ఉచితంగా ఎండిటి చికిత్స అందిస్తామని తెలిపారు. సిహెచ్ఒ లక్ష్మి, ఎఎన్‌ఎం కమల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామస్తుల చేయూత

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

తమలో ఒకడిగా ఉండే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ ఆదరణ లేకుండా అవస్థలు పడుతుండటం చూసి గ్రామస్తులు చేయూత అందించారు. బెండి గ్రామానికి చెందిన శంకు కుమారస్వామి గత కొన్నాళ్ళుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో భోజనానికి కూడా ఇబ్బంది పడతున్న దుస్థితి చూసి గ్రామస్తులంతా చలించి ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి అందరూ కలిసి రూ.44 వేలు పోగు చేసారు. ఆ మొత్తాన్ని శనివారం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయంగా అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు.


లీజు రద్దు పత్రాన్ని ఎమ్మెల్యే శిరీషకు అందజేస్తున్న శ్రీకాంత్

కేంద్రీయ విద్యాలయ స్థల పరిశీలన

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ పరిధిలో కేంద్రీయ విద్యాలయం నిర్మించాలన్న గౌత శిరీష సంకల్పం మేరకు శనివారం రెవెన్యూ అధికారులు స్థల పరిశీలనకు ఉపక్రమించారు. ఈ సందర్భంగా విషయం తెలుసుకున్న దువ్వాడ శ్రీకాంత్ ఈ విషయంపై ఆనందం వ్యక్తం చేస్తూ గత ప్రభుత్వంలో తనకు సూదికొండ ప్రాంతంలో సర్వే నెంబరు 51/1లో 3.560 హెక్టార్లు 10 సంవత్సరాల లీజును స్వచ్ఛందంగా రద్దు చేస్తూ ఆ ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయం నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా లీజు రద్దు చేస్తూ ఎమ్మెల్యే శిరీష సమక్షంలో రెవెన్యూ అధికారులకు లేఖ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో తన పేరుట సూది కొండల్లో క్వారీ లీజు మంజూరు జరిగినప్పటికీ అప్పటి ప్రభుత్వంలో అధికార పార్టీ మద్దతుతో అక్కడ నాయకులే కొండను కొల్లగొట్టారని భవిష్యత్‌లో ఇటువంటి పరిణామాలు జరగకుండా తన లీజును రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. ఆ ప్రాంతంలో కేంద్రీయ పాఠశాల నిర్మాణం జరిగితే సూదికొండ ప్రాంతంలో ప్రభుత్వ భూములు కాపాడుటకు అవకాశం ఉంటుందని శ్రీకాంత్ పేర్కొన్నారు. శ్రీకాంత నిర్ణయాన్ని స్వాగతిస్తూ ఇటువంటి నిర్ణయాన్ని అభినందిస్తున్నామని శిరీష పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్ఎస్‌విఎస్ నాయుడు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ పి.నిరంజన్, మండల సర్వేయర్ వై.వి.గిరి, టిడిపి నాయకులు విఠల్, గాలి కృష్ణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, మల్లా శ్రీనివాసరావు, కాళీ తదితరులు పాల్గొన్నారు.

వర్షపునీటితో అవస్థలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని 8వ వార్డు పరిధి బిఆర్ నగర్‌లో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో రహదారులన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, ఉన్నత కుటుంబాలకు చెందినవారు బిఆర్ నగర్‌లో ఉంటున్నారు. ఈ ప్రాంతంలో కాలువలు, సిసి రహదారలు లేకపోవడంతో వాడుక నీరుతో పాటు వర్షం నీరు రహదారిపై ప్రవహిస్తుందని అక్కడి ప్రజలు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో మట్టి రహదారులన్నీ జలమయంగా మారింది. భారీగా ఉన్న వర్షపు నీటితో క్రిమి కీటకాలు, విష సర్పాలు ఎక్కడ ఇళ్లల్లోకి ప్రవేశిస్తాయోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, మున్సిపల్ అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇచ్ఛాపురం: పట్టణంలో 17 వార్డు పరిధిలోని


ఇచ్ఛాపురం : రోడ్డుపై నిలిచిన నీరు

సంతాపేటలో పుంపు హౌస్ వీధిలో చినుకు పడితే చాలు రోడ్డుపై నీరు నిలుస్తుంది. దీంతో వీధి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై నీరు నిలిచి దోమలు, ఈగలు, విషసర్పలు బెడద తీవ్రంగా ఉంటున్నాయి. పట్టణంలోని తాగునీరు సరఫరా చేసే ప్రధాన పంపు హౌస్ ఇక్కడే ఉంది. నిత్యం ప్రజలతో పాటు మున్సిపల్ అధికార సిబ్బందీ రాకపోకలు సాగించే వీధిలో రోడ్డుపై నీరు నిలిచినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు తక్షణ చర్యలు తీసుకొని నీరు నిల్వకుండ కాలువలు నిర్మించాలని వీధి ప్రజలు కోరుతున్నారు.

స్త్రీనిధితో ఆర్థిక భరోసా

ప్రజాశక్తి- మందస


ప్రసాదరావు, ఎపిఎం

స్త్రీనిధితో మహిళలకు కొండంత ఆర్థిక భరోసా కలుగుతుందని ఎపిఎం గొడబ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీనిధి రుణాల కింద రూ.8.30 కోట్లు మండలంలోని 372 స్వయం సహాయక సంఘాల్లో ఉన్న 1198 మంది డ్వాక్రా సభ్యులకు రుణాలు అందించామని అన్నారు. ఈ రుణాలు తీసుకున్న స్వయం సహాయక సంఘాలు సభ్యులు ఆర్థికంగా, సుస్థిర జీవనోపాధులు కల్పించుకున్నారని తెలిపారు. జిల్లాలో మందస 2023-24లో మండలం ప్రథమ స్థానంలో నిలిచింద న్నారు. మరలా 2024-25లనూ స్త్రీనిధి రుణాలు రూ.8 కోట్ల లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. ఇప్పటికే రూ.కోటి రుణాలు అందించామని చెప్పారు. మిగతా రూ.7 కోట్లు మహిళా సభ్యుల అవసరాన్ని బట్టి స్త్రీనిధి రుణాలు అందంచేందుకు ఇప్పటికే ప్రణాళికలు తయారు చేసుకున్నామని చెప్పారు. స్త్రీనిధి రుణాలు 11 శాతం వడ్డీతో నేరుగా మహిళ సభ్యులకు అందజేశామన్నారు.

ఆమదాలవలస: మహిళా స్వయం శక్తి సంఘ సభ్యులకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలు మహిళల జీవనోపాధికి భరోసా అని వెలుగు ఎపిఎం పైడి కూర్మారావు తెలిపారు. శనివారం మండలంలోని గాజుల కొల్లివలస పంచాయతీ పరిధిలో రాధాకృష్ణాపురం స్వయంశక్తి సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని రికార్డులను పరిశీలించారు. మండల పరిధిలో రూ.5 కోట్ల 26 లక్షలు మహిళలకు తమ జీవనోపాధులను మెరుగు పరుచుకోవడానికి రుణాలు మంజూరు చేశామన్నారు. గ్రామ సంఘం ద్వారా తీసుకున్న సిఐఎఫ్ స్త్రీనిధి, ఉన్నతి రుణాలను తిరిగి చెల్లించినప్పుడు తప్పనిసరిగా రసీదును తీసుకోవాలని సూచించారు. గ్రామ సంఘ సమావేశంలో ప్రతినెల సంఘం డిసిబిలను చదివి సభ్యులందరికీ వినిపించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక సంఘం డబ్బులను ఇంకో సంఘానికి సర్దుబాటు చేస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. ఈ విధంగా చేయడం వలన సక్రమంగా కట్టిన సంఘ సభ్యులు నష్టపోతారని వివరించారు. కార్యక్రమంలో విఒఎ జయసుధ, స్వయం శక్తి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి


కోటబొమ్మాళి: పాడిరైతులు పశువులకు లంపీ వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశు సంవర్ధక సంయక్త సంచాలకులు డాక్టర్ వి.విజయరాజు అన్నారు. శనివారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, కోటబొమ్మాళి సహాయ సంచాలకులు డాక్టర్ మంద లోకనాథం, కురుడు పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్, తిలారు పశువైద్యాధికారి ఎం.ప్రజ్ఞచైతన్య ఆధ్వర్యంలో పశువులకు లంపి వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ టీకాలను పశువులకు ఉచితంగా వేయటం జరుగుతుందన్నారు. ఈ టీకాలు 4 మసాలు వయసు పైబడిన దూడలు నుంచి అన్ని వయసుల వాటికి వేసుకోవచ్చునని, అలాగే చూడితో ఉన్న పశువులకు కూడా వేసుకోవచ్చునని పాడి రైతులకు సూచించారు.

టెక్కలి రూరల్: మండలంలోని లింగాలవలస పశువైద్యశాల పరిధిలో లింగాలవలస, పరశురాంపురం, సవరకిల్లి, తిర్లంగి గ్రామాల్లో లంపీ స్కిన్ డిసీజ్ (ముద్ద చర్మపు వ్యాధి) నివారణకు శుక్రవారం 200 పశువులకు వ్యాధి నిరోధక టీకాల వేసినట్లు డాక్టర్ మెట్ట పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ


కోటబొమ్మాళి : పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారులు

సందర్భంగా మాట్లాడుతూ ప్రోగ్రాం నెల రోజులు పాటు టీకాలు వేస్తున్నామన్నారు. ఈ వ్యాధి కాప్రి పోక్స్ వైరస్ వల్ల కలుగుతుందన్నారు. ఇది రక్తం తాగే కీటకాలు ద్వారా ఒక పశువు నుంచి వేరే పశువుకు సోకుతుందన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులకు అధిక జ్వరం, చర్మంపై నోడ్యూల్స్, ఎడిమా, నీరశించి పోవడం, పాల దిగుబడి తగ్గడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ వ్యాధి నివారణకు ముందస్తుగా టీకాలు వేశామన్నారు. పాడి రైతులు పశువులకు ఈ టీకాలు రైతు సేవా కేంద్రాల్లోని పశుసంవర్ధకశాఖ సిబ్బంది ద్వారా ఉచితంగా వేసుకోవాలన్నారు. లింగాలవలస సర్పంచ్ సంపతిరావు, లక్ష్మి, రాఘవరావు, సిబ్బంది వరలక్ష్మి, అనిల్, యోగేంద్ర, చిన్నమ్మి, గిరిబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శి రమణమూర్తి


రమణమూర్తి దంపతులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఉపాధ్యాయ ఉద్యోగం అంటే విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు వచ్చిన ఒక మంచి అవకాశంగా భావించి జీవితాంతం వారి అభివృద్ధికి తన బోధనను అంగూరు రమణమూర్తి మాస్టర్ జీవితం అందరికీ ఆదర్శం. ఈ నెల 31న తన సుదీర్ఘ 35 ఏళ్ల ఉపాధ్యాయ అభివృద్ధికి ఉద్యోగ విరమణ చేస్తున్న మాస్టర్ జీవితంలోని ముఖ్య ఘట్టాలు. నేటితరం ఉపాధ్యాయులకు మార్గదర్శకులు 1962 జులై 10న పాతపట్నం మండలం పాతపట్నంలో శ్రీరాములు, తులసమ్మ దంపతులకు ఏకైక కుమారుడుగా రమణమూర్తి జన్మించాడు. ఈయనకు అక్క, చెల్లి ఉన్నారు. బిఎస్‌సి బిఇడి చేసి ఎంతో ఇష్టపడి కోరుకున్న ఉపాధ్యాయ వృత్తిలో 1989 సెప్టెంబరు 15న చేరారు. మెళియాపుట్టి మండలం పెద్దలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా తొలిసారి ఉద్యోగంలో చేరారు. అనంతరం 2009లో ఉద్యోగోన్నతి పొంది పాతపట్నం మండలం తెంబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా చేరారు. ఈయన ప్రస్తుతం మెళియాపుట్టి మండలం పెద్దలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఆయనకు 1988లో విజయలక్ష్మితో వివాహమైంది. పెద్ద కుమారుడు కావలిలో రైల్వేలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. కోడలు మెకానికల్ ఇంజినీరుగా చేస్తున్నారు. చిన్న కుమారుడు ఐటిసిఎల్ అసిస్టెంట్ మేనేజర్‌గా హల్దియాలో పనిచేస్తున్నారు. కుమార్తె సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా హైదరాబాదులో పనిచేస్తున్నారు. ఇదే సమయంలో మండల ప్రధానోపాధ్యాయుల కో-ఆర్డినేటర్‌గా, నోడల్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారు. 2004లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఉద్యోగానికి మాత్రమే ఉద్యోగ విరమణ చేస్తున్నానని, వాదనకు కాదని ఆయన చెబుతున్న మాటలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయి.

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల


చిన్నారావు

ఎచ్చెర్లకు చెందిన జలుబుల చిన్నారావు అనే యువకుడు ఈనెల 18వ తేదీ రాత్రి నుంచి కనిపించడం లేదని యువకుడు తండ్రి రాజారావు ఎచ్చెర్ల పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ యువకుడు ఐటిఐ పూర్తి చేసి పైడి భీమవరంలో ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఈనెల 18వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదని, వారి బంధువులను వాకబు చేసినా ఆచూకి తెలియలేదని తండ్రి రాజారావు తెలిపారు. రాజారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చిరంజీవి తెలిపారు.


కూలిన పెంకుటిళ్లు గోడను పరిశీలిస్తున్న నాయకులు

కూలిన గోడ... తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- లావేరు

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లావేరు మండలం కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో రౌతు సీతారామయ్యకు చెందిన రెండు పెంకిటిళ్లల గోడ కూలి పోయింది. ఆ సమయంలో ఇంట్లో కుటింబీకులు నిద్రస్తున్నారు. భారీ వర్షానికి గోడ తడిచిపోవడంతో ఒక్కసారిగా గోడ కూలి బయటి పడిపోయింది. గాఢ నిద్రలో ఉన్నవారు ఆ శబ్ధానికి ఉలిక్కిపడి ప్రాణాలు అరచేతిలో పట్టుకొని ఏం జరిగిందో తెలియక భయబ్రాంతులకు గురయ్యారు. గోడ బయటకు పడిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో ఇంట్లో సీతారామయ్య, భార్య రమణమ్మతో పాటు మరో ముగ్గురు అక్కడే నిద్రిస్తున్నారు. ఇరుగు పొరుగు వారు వచ్చి వారికి సహాయ సహకారాలు అందించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, లంకలపల్లి శ్రీను, ఆనంద్, జగ్గన్నదొర, కోలా రాజేష్ తదితరులు శనివారం ఆ కూలిన ఇళ్ల గోడలను పరిశీలించి పరామర్శించారు. ప్రమాద విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

అవయవదానం ఆదర్శనీయం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

నౌపడ: సంతబొమ్మాళి మండలం గోవిందపురం పంచాయతీ జొన్నలపాడుకు చెందిన చల్లా శ్రీనివాస్ చనిపోతూ నలుగురికి అవయవ దానం చేయడం ఆదర్శనీయమని రాష్ట్ర వ్యవసాయ, మత్స్య శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటనలో తెలిపారు. రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ మృతి చాలా బాధాకరమని, ఆయన తల్లిదండ్రులు తమ బిడ్డ అవయవాలను దానం చేయాలనే నిర్ణయంతో కిడ్నీ, గుండె, కాలేయంతో పాటు ఇతర అవయవాలను ఆస్పత్రికి అప్పగించడం గొప్ప నిర్ణయమన్నారు. శ్రీనివాస్ మృతి పట్ల సంతాపం ప్రకటించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న ఆసక్తి గల అభ్యర్థులకు డాక్టర్ రెడ్డీస్ ఫార్మా ఈనెల 21న మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెంలో ఎన్ఇఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో స్పెషల్ రిక్రూట్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 22, జూలై 2004 నుంచి 22, జూలై 2006 మధ్య పుట్టినవారై ఉండాలని, ఇంటర్మీడియట్ బైపిసి, ఎంపిసి కెమిస్ట్రీ, బోటనీ, గణితంలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారై ఉండాలన్నారు. తెలుగు, అంగ్ల భాషల్లో నైపుణ్యం ఉండాలని. ఎడ్యుకేషన్ గ్యాప్, కంపార్ట్మెంట్ విద్యార్థులు అనర్హులన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ సర్టిఫికేట్లు, రెండు ఫోటోలు, పాన్, ఆధార్ కార్డులు, ఓటర్ ఐడి కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఆదాయ ధ్రువీకరణ పత్రం లేదా తెలుపు రేషన్ కార్డు తప్పనిసరిగా తీసుకుని హాజరు కావాలన్నారు.

నిధుల విడుదలపై హైకోర్టు ఉత్తర్వులు

ఎచ్చెర్ల: ఫరీదుపేటకు కాంట్రాక్టర్ మొదలవలస కృష్ణ గత ప్రభుత్వం చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో చేసిన పనులకు బిల్లులు కాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించగా సదరు హైకోరు W/P నెంబర్ 9682/2024 ఉత్తర్వులు ప్రకారం ఆగస్టు 9, 2024 లోపు పేమెంట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసినట్టు కృష్ణ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఎచ్చెర్ల: మండలం కుశాలపురంలో వైసిపి కార్యకర్త పైడి ఆనందరావుకు చెందిన శ్రీరాజ రాజేశ్వరి ఆటో స్పేర్స్ షాప్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు రూ.60 లక్షల విలువ గల ఆటో స్పేర్స్ నష్టం వాటిల్లింది. దీంతో శనివారం ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ ఆనందరావును పరామర్శించి షాప్‌ను పరిశీలించి అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు వైసిపి నాయకులు సనపల నారాయణరావు, పైడి వెంకన్నగారి శ్రీను, సూర అప్పారావు, సీపాన యర్రం నాయుడు, పైడి చందు, పైడి సాంబమూర్తి, బుజ్జి తదితరులున్నారు.

ఆకుమడులు పరిశీలన

బూర్జ: మండలంలోని పనుకుపర్తలో నీట మునిగిన నారుమడులు, అలాగే వెద జల్లిన పొలాలను మండల వ్యవసాయాధికారి ఎం.శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు ఆదివారం ఉదయం పొలాల నుంచి బయటికి వెళ్లిపోతుందని అంచనా వేశారు. ఒకవేళ వర్షపు నీటిలో 72 గంటల కంటే ఎక్కువ సమయం పంటలు మునిగి ఉంటే ఇబ్బంది అవుతుందని రైతులకు తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలో 11 గ్రామాల్లో 75 హెక్టార్లలో వరి పంట నీట మునిగిందన్నారు. గ్రామ రెవెన్యూ అధికారి డి.వి.రమణమ్మ, గ్రామ వ్యవసాయ సహాయ కులు హేమలత, రైతులు అప్పలనాయుడు పాల్గొన్నారు.


నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న ఎఒ శ్రీనివాసరావు

వరద నీటిలో రైల్వే అంతర్గత రహదారులు



కనుగులవలస వద్ద నీట మునిగిన అంతర్గత రహదారి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పట్టణంలోని మామిడి కృష్ణమూర్తి నగర్ ఎదురుగా, మండలంలోని కనుగులవలస వద్ద ఉన్న అంతర్గత రహదారులు పూర్తిగా నీటితో నిండిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. పట్టణంలోని రైల్వే అంతర్గత రహదారి నుంచి బిఆర్ నగర్ గేటు శ్రీకాకుళం వెళ్లే వాహనదారులు శుక్రవారం అర్ధరాత్రి నుంచే రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే మండలంలోని కనుగులవలస వద్ద నున్న రైల్వే అంతర్గత రహదారి పూర్తిగా నీటితో మునిగిపోవడంతో తొగరాం, కలివరం, ముద్దాడ పేట, తమ్మయ్యపేట, దూసి తదితర 10 గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పట్టణం నుంచి వెళ్లాల్సిన ప్రజలు అటు నుంచి ఇటు రావాల్సిన వారు రైల్వే అంతర్గత రహదారి వద్దకు చేరుకొని మనిషి మునిగిపోయే నీటిలో రాకపోకలు సాగించలేక వాహనాలను అటువైపు, ఇటువైపు ఉంచి రైల్వే పట్టాలు దాటుకుంటూ ప్రమాదకర స్థితిలో రాకపోకలు ప్రజలు కొనసాగించారు. రైల్వే శాఖ అధిక నిధులను వెచ్చించి అంతర్గత రహదారులను నిర్మించినప్పటికీ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వాపోయారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు రైల్వే అంతర్గత రహదారులను మెరుగుపర్చి ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న తేజేశ్వరరావు

విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి- పాతపట్నం

స్థానిక ఎస్‌సి కాలనీకి చెందిన శిర్ల మహేష్ ట్రిపుల్ ఐటిలో అడ్వాన్స్‌లో రెండు వేలు ర్యాంకు సాధించారు. ఈ మేరకు బిజెపి నాయకులు సిరిపురం తేజేశ్వరరావు విద్యార్థిని, ఆయన తండ్రి జానీ శనివారం అభినందిస్తూ సన్మానించారు. మహేష్ తండ్రి జానీ మండల విద్యాశాఖ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచిపేరు తీసుకుని రావాలని కోరారు.

వర్షాలపై అప్రమత్తం

వజ్రపుకొత్తూరు: వర్షాలపై మండల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎం.సురేష్ సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విపత్తు నిర్వహణపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన మేరకు సహాయ చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. భారీ వర్షాలు కురిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు వివరించాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డయేరియా వంటి రోగాలు బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. గ్రామాల్లోని పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎఒపిడిఒ తిరుమలరావు, విద్య శాఖాధికారి బి.వి.రమణ, మండల ఎఒ కిరణ్‌వాణి, ఎపిఒ శంకరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ సురేష్

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రవి

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వాటిని పరిష్కరించాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రవి అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ 20 నుంచి 30 వరకు హాస్టల్ సందర్శన కార్యక్రమంలో భాగంగా శనివారం పలాస హాస్టళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు దుప్పట్లు, ట్రంకు పెట్లు, దోమల తెరలు పంపిణీ చేయాలన్నారు. సుమారు 8 నెలల నుంచి మెస్ ఛార్జీలు చెల్లించకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న కుక్, కమాటి, వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. లేకుంటే ఆగస్టు 6న చలో కలెక్టరేట్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు పవన్, గుణశేఖర్, జీవన్, జస్వంత్ పాల్గొన్నారు.

జగతిలో హోమియో వైద్యం

కవిటి: మండలంలోని జగతిలోని హోమియో కేంద్రంలో ఇకపై ప్రతి మంగళ, గురు, శనివారాలు తాను అందుబాటులో ఉంటానని ప్రభుత్వ హోమియో వైద్యులు దుర్గాప్రసాద్ తెలిపారు. గతేడాదిగా ప్రభుత్వ హోమియో వైద్యులు అందుబాటులో లేకపోవడంపై స్థానికులు ఉన్నతాధికారులను సంప్రదించారు. దీనిపై స్పందించిన అధికారులు వారంలో మూడు రోజులు ప్రభుత్వ హోమియో వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి దుర్గాప్రసాద్

'సుజల స్రవంతి'ని ప్రారంభించాలి

ప్రజాశక్తి- పలాస

పాలకుల నిర్లక్ష్యానికి ఉత్తరాంధ్ర వెనుకబాటు తనమే ఒక నిదర్శనమని, ఉత్తరాంధ్ర అభివృద్ధి కావాలంటే వ్యవసాయమే ప్రధాన జీవనాధారమని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జల ఈశ్వరయ్య అన్నారు. పలాసలో రైతు సంఘ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వంశధార, మహేంద్ర తనయ, బహుదా వంటి ప్రధాన నదులు ఉన్నా... రైతాంగానికి సాగునీరు అందించడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆఫ్‌షోర్ రిజర్వాయరు పూర్తి చేయాలన్నారు. జీడి పంటకు రూ.16 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రైతు సంఘం కమిటీని ఎన్నుకున్నారు. ఆ సంఘ కన్వీనర్‌గా చాపర వేణుగోపాల్, కోకన్వీనర్‌గా అయినింటి లోకనాథం, సభ్యులుగా పి.ఎర్రంనాయుడు, హనుమంతు శంకరరావు, సొర్ర లక్ష్మణరావు, మెట్ట సింహాచలం, కొన్న రమణాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉపాధి హామీ కూలీలకు ఆరు వారాలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దుబ్బ భాస్కరరావు అధికారులను కోరారు. ఈ మేరకు వజ్రపుకొత్తూరు సచివాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 200 రోజులు పనులు కల్పించాలన్నారు. రోజుకు రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. రోజుకు ఐదు కిలోల బియ్యం అదనంగా చెల్లించాలన్నారు. రూ.7,500 బ్యాంకు ఖాతాలో డబ్బులు చెల్లించాలన్నారు. పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో రూ.20 వేలు జమ చేయాలని కోరారు. 80 కిలోల జీడి పిక్కలకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. జీడి, మామిడి, మునగ, కొబ్బరి పంటలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం గ్రామ రెవెన్యూ అధికారి తిరుమల చౌదరికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు జుత్తు హేమంత్, కార్యదర్శి దుబ్బ భానుమతి పాల్గొన్నారు.

అధ్వానంగా దుర్గమ్మ కాలనీ రోడ్డు

ప్రజాశక్తి- పాతపట్నం

స్థానిక దుర్గమ్మకాలనీ-3లో కొన్నాళ్ల నుంచి సిమెంట్ రోడ్ సదుపాయం, తాగునీరు లేక అవస్థలు పడుతున్నారు. ఈ వీధిలో 50 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీధికి రహదారి కల్పించకపోతే పన్నులు కట్టే ప్రసక్తే లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం మాత్రం ఈ వీధిలో ప్రయాణించాలంటే నరకయాతన అనుభవస్తున్నారు. వీధి బురదమయం కావడంతో వాహనదారులు, పాదచారుల అవస్థలు వర్ణనాతీతం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సిసి రోడ్డు, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

తెలగలను బిసిలో చేర్చాలి

ప్రజాశక్తి- కవిటి

తెలగలను బిసి జాబితాలో చేర్చి వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని బిపి రామారావు ఆధ్వర్యాన నియోజకవర్గ తెలగల సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే అశోక్‌ను కోరారు. ఈ మేరకు శనివారం రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం తెలగల సంక్షేమ సంఘం తరపున ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలగల సంక్షేమానికి తమవంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గతేడాది డిసెంబరులో వచ్చిన మీచింగ్ తూపాను కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కోర్నాన బాలజీరావు కోరారు. మండలంలోని బెండి సచివాలయ కార్యదర్శి మధును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి ఎన్నికల సమయంలో రైతులకు పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ.20 వేలు తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఉపాధి కూలీలకు ఆరు వారాల బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలన్నారు. రోజుకు రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. హేమ సుందర్ రావు, నీలాచలం, హెచ్.ముకుంద రావు, సన్యాసిరావు, దివాకర్, యోగి, శంకరరావు, భీష్మ పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు

వజ్రపుకొత్తూరు: పనిప్రదేశాల్లో మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కాశీబుగ్గ ఐసిడిఎస్ పిఒ లావణ్య హెచ్చరించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో లైంగిక వేధింపులు నిరోధక చట్టం 2013పై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లైంగిక వేధింపులు నియంత్రణకు ప్రతిచోటా అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీల్లో అధ్యక్షులుగా సీనియర్ మహిళా ఉద్యోగినితో పాటు మహిళా హక్కులపై నిబద్ధత, సామాజిక స్పృహ చట్టంపైన అవగాహన కలిగి ఉండాలన్నారు. మరో మహిళా ఉద్యోగి, పురుష ఉద్యోగిని సభ్యులుగా ఉండాలన్నారు. తప్పని సరిగా మూడో పక్షానికి చెందిన సామాజిక కార్యకర్త, స్వచ్ఛంద సంస్థను కమిటీ కార్యక్రమాల్లో పాల్గొనడానికి అవకాశం కల్పించాలని సూచిం చారు. లైంగిక వేధింపులకు గురైన బాధితులు రాత పూర్వకంగా అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేయాలని తెలిపారు. బాధించిన వ్యక్తి ఉద్యోగి అయితే శాఖాపరమైన నిబంధనలు మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపిడిఒ దిక్కల తిరుమలరావు, తహశీల్దార్ ఎం.సురేష్, ఎంఇఒ దశరథి, బి.వి.రమణ, అంగన్వాడీ సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, లత తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి- పలాస

సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గౌతు శిరీష సూచించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుక్క, పాము కాటు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. డెంగీ, మలేరియా వ్యాధులు రాకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారి సునీల్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

'ఉపాధి' పనుల్లో నాణ్యత తప్పనిసరి



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- పోలాకి

ఉపాధి హామీ ద్వారా చేస్తున్న పనులు రైతాంగానికి, ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని మబగాం క్యాంపు కార్యాలయంలో ఉపాధి అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ పనులు అస్తవ్యస్తంగా కాకుండా ప్రజలకు ఉపయోగపడేలాగా ఉండాలన్నారు. మట్టి, సిసి రోడ్లు, పశువుల షెడ్లు, చెక్కు వాల్ డ్యామ్స్, టూరిజం వర్క్స్, ఊరూరా మొక్కల ప్లాంటేషన్, ప్రతి కుటుంబానికీ వంద రోజులు పని కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకులు చిట్టిరాజు, ఎపిఎం రమణారావు పాల్గొన్నారు.